www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 30 నవంబర్ 2024
5
అన్నమయ్య

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి : సిఐ

మాట్లాడుతున్న ఎక్సైజ్ సిఐ మల్లిక

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ సిఐ మల్లిక అన్నారు. శుక్రవారం అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మాదకద్రవ్య వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వల్ల వ్యక్తిగత, కుటుంబ, సామాజిక జీవితంపై ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. యువత మాదక ద్రవ్యాల ప్రభావానికి గురికాకుండా ఆరోగ్యకరమైన జీవనాన్ని గడపాలని పిలుపునిచ్చారు. యువత, ప్రజలందరి సహకారంతో పోరాడితేనే మాదక ద్రవ్యాల వినియోగం నివారించవచ్చునని తెలిపారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.ఎం.వి.నారాయణ మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ తమ సామాజిక బాధ్యతను గుర్తుచేసుకొని దేశ నిర్మాణంలో ప్రముఖ పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఓబులపతి, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు కౌంట్‌డౌన్

5న నోటిఫికేషన్ విడుదల
8న ఎన్నికల పోలింగ్

సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు కసరత్తు ఊపందుకుంది. గురువారం రాష్ట్ర నీటిపారుదల శాఖా మంత్రి డిసెంబర్ ఎనిమిదో తేదీన సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహిస్తామని పేర్కొనడం తెలిసిందే. కడప, అన్నమయ్య జిల్లాల యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టర్ల పర్యవేక్షణలో ఇరిగేషన్, రెవెన్యూ అధికార యంత్రాంగం శిక్షణ తరగతుల దగ్గర నుంచి సభ్యత్వ నమోదు పోలింగ్ నిర్వహించే ప్రయత్నాల్లో నిమగ్నమైంది. ఈ నెల ఐదున నోటిఫికేషన్ విడుదల చేయడానికి రంగం సిద్ధం చేసింది. అనంతరం ఎనిమిదో తేదీ నుంచి 14 తేదీల నాటికి చిన్నతరహా, మధ్యతరహా, భారీ ప్రాజెక్టుల పరిధిలోని డిస్ట్రిబ్యూటరీలకు సైతం ఎన్నికలు నిర్వహించడానికి పూర్వ రంగాన్ని సిద్ధం చేశారు.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప జిల్లాలో 206, అన్నమయ్య జిల్లాలో 94 సాగునీటి సంఘాలు ఉన్నాయి. కడప జిల్లా సాగునీటి పారుదల శాఖ పరిధిలో ఆరు ఇరిగేషన్ సర్కిల్స్ పరిధిలోని మైనర్ 112, మీడియం 16, మేజర్ 78 వెరసి 206 సాగునీటి సంఘాలు ఉన్నాయి. అన్నమయ్య జిల్లాలో మైనర్ ఇరిగేషన్ చెరువుల కింద 94 సాగునీటి సంఘాలు ఉండడం గమనార్హం. 2015లో అప్పటి టిడిపి సర్కారు సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించడం తెలిసిందే. సుమారు పదేళ్లుగా సాగునీటి సంఘాలు మనుగడలో లేక పోవడంతో రైతుల్లో ఉత్సాహం కొరవడినట్లు కనిపిస్తోంది.

8న ఎన్నికలు షురూ!

ఈ నెల ఎనిమిదిన సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధం చేశాయి.కడప, అన్నమయ్య జిల్లాల వ్యాప్తంగా చెరువుల గుర్తింపు దగ్గర నుంచి సుమారు ఆరుగురు చొప్పున ఇరిగేషన్ ఎఇల దగ్గర నుంచి రెవెన్యూశాఖలో తహశీల్దార్ స్థాయి అధికారుల జాబితాను సిద్ధం చేయడం తెలిసిందే. డిసెంబర్ ఐదున ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనుంది. అనంతరం ఎనిమిదిన పోలింగ్ నిర్వహించనుంది. ఆయా సాగునీటి సంఘాల వారీగా రైతులను ఏకగ్రీవం చేయడానికి ప్రయత్నం చేయనుంది. పోటీ అనివార్యమైన పక్షంలో సాగునీటి సంఘాలకు చెందిన సభ్యులు చేతిని ఎత్తి ఎన్ను కోవడమా, లేనిపక్షంలో స్లిప్‌ల ద్వారా వేసిన ఓట్లను లెక్కించిన అనంతరం అధ్యక్షులు, ఉపాధ్యక్షులను ఎన్నుకోనున్నట్లు తెలుస్తోంది. కెసికె నాల్, మధ్యతరహా, భారీ ప్రాజెక్టుల సాగు సంఘాల ఎన్నికలు నిర్వహి స్తారు. అనంతరం 14న ఆయా డిస్ట్రిబ్యూటరీలకు చైర్మన్, వైస్ ఛైర్మన్ల అభ్యర్థుల నియామక ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు తెలుస్తోంది.

పైసలేవీ..!

సాగునీటి సంఘాల ఎన్నికలు సరే, నిధుల కేటాయింపుల సంగతేమిటో తెలియడం లేదు. ఇప్పటి వరకు ఆయా జిల్లాలకు చెందిన ఇరిగేషన్, రెవెన్యూ యంత్రాంగాలకు అవగాహన కల్పించడం వరకు పైసా అవసరం లేకుండా పోయింది. క్షేత్రస్థాయిలో ఎన్నికల నిర్వహ ణకు నిధులు కేటాయించాల్సి ఉంది. పోలింగ్ గడువు దగ్గర పడుతున్నప్పటికీ కేటాయింపులు చేయని పరిస్థితి కనిపిస్తోంది. ఎన్నికల పోలింగ్ సంబంధించి పోలింగ్ సామగ్రి తరలించడం మొదలుకుని టి.ఎ, డిఎ, ఇతర ఎన్నికల అవసరాలకు నిధులు కేటాయించకపోతే ఎలా అనే వాదన వినిపిస్తోంది.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి/రాయచోటి టౌన్/చిన్నమండెం/రామాపురం

బాల్యవివాహాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఫయాజ్ ఫంక్షన్ హాల్లో స్త్రీ శిశు సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో కిషోర్ వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని బాల్యవివాహాలు జరిగితే ఎఫ్ఐఆర్ నమోదు చేసి కఠినంగా శిక్షిస్తామన్నారు. జిల్లాలో ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగినట్లయితే ఎఫ్ఐఆర్ నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాల్య వివాహాలను ప్రోత్సహించే వారిని సహించేది లేదని హెచ్చరించారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు ప్రతి ఒక్కరు బాల్య వివాహాల నిర్మూలనకు టోల్ ఫ్రీ నెంబర్ 1098కు ఫోన్ చేసి సహకరించాలన్నారు. ప్రస్తుత సమాజంలో మహిళలు మగవారికి ఏమాత్రం తీసుకోకుండా అన్ని రంగాలలో ముందున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో మహిళలు మరింత పైకి ఎదిగేందుకు ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందన్నారు.

ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరణ : ప్రజా దర్బార్ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు అక్కడికక్కడే పరిష్కరిస్తామని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. రాయచోటి పట్టణంలోని తమ క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రజా సమస్యలు పరిష్కారానికి నోచుకోక ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనే వారిని నేడు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజల సమస్యలు అక్కడికక్కడే పరిష్కరిస్తోందని పేర్కొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలి: ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. చిన్నమండెం మండలం, దేవగుడిపల్లె కెజిబివి పాఠశాలను మంత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహాలలో ఉండే విద్యార్థులను ఉపాధ్యాయులు, వార్డెన్లు తమ కన్నబిడ్డల చూసుకోవాలన్నారు. విద్యార్థులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వంటగదులు, మరుగుదొడ్లు, పాఠశాల తరగతి గదులు, పాఠశాల పరిసర ప్రాంతాలను మంత్రి పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వ మెను ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని విద్యార్థులకు నాసిరకం భోజనం అందిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులకు నీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు కెజిబివి పాఠశాలలో శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి మంత్రి నూతన బోరును ప్రారంభించారు.

యువత రాష్ట్రానికి మంచి పేరుతేవాలి : యువత దేశానికి శక్తిలాంటివారని, అన్ని రంగాలలో ముందుండి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. రామాపురం మండల పరిధిలోని బిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో అన్నమయ్య జిల్లా యువజనోత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి ఒక కల ఉంటుందని వారి కలను నిరూపించుకోవడానికి ఇలాంటి యువజన ఉత్సవాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. జిల్లాలో యువజన ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. యువత అనుకుంటే సాధించలేనిది ఏదీ లేదని యువత మంచి మార్గాన్ని ఎంచుకొని సమాజానికి ఉపయోగపడే మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సమాజంలో ప్రమాదాలు జరుగుతూ కొన్ని సమయాలలో రక్తం దొరకక కొంతమంది అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అలాంటి వారందరికీ యువత రక్తదానం చేసి మరొకరికి ప్రాణదాతలు కావాలన్నారు. ప్రతి ఒక్కరూ సంవత్సరానికి ఒక్కసారైనా రక్తదానం చేయాలన్నారు. కార్యక్రమంలో స్టెప్ సిఇఒ సాయి గ్రేస్, బిట్స్ కళాశాల కరస్పాండెంట్ భాస్కర్, ప్రిన్సిపల్ సిఎస్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు : విభిన్న ప్రతిభావంతుల సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపడతామని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. రామాపురం మండల పరిధిలోని బిట్స్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.వీరారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీను, కడప జిల్లా విభిన్న ప్రతిభావంతుల ఉపాధ్యక్షుడు బి.దామోదర్‌రెడ్డి తమ సమస్యల పరిష్కారానికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల సమస్యలన్నీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని మంత్రి వారికి తెలిపారు.

మున్సిపల్ డ్రైవర్లకు కనీస వేతనం అమలు చేయాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు

కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న సిఐటియు, మున్సిపల్ యూనియన్ నాయకులు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

రాయచోటి మున్సిపాలిటీలో పనిచేస్తున్న డ్రైవర్‌లకు కనీస వేతనం రూ.24,500 వేతనం అమలు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు పేర్కొన్నారు. శుక్రవారం సిఐటియు నాయకులు, మున్సిపల్ యూనియన్ నాయకులు ర్యాలీగా వెళ్లి మున్సిపల్ కమిషనర్ వాసుబాబుకి సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సంవత్సరం మున్సిపల్ వర్కర్స్ రాష్ట్ర వ్యాప్త సమ్మె ఫలితంగా వాహన డ్రైవర్లకి కనీస వేతనం రూ.24,500 ఇవ్వాలని జిఒ నెంబర్ 36 విడుదల చేసిందన్నారు. రాయచోటి మున్సిపాలిటీలో సాంకేతిక సమస్యల వలన ఆప్కాస్ నందు నమోదులో స్వీపర్ల గానే కొనసాగుతున్నారని పేర్కొన్నారు. వెంటనే డ్రైవర్లుగా సరిచేసి కనీస వేతనం 11 మంది డ్రైవర్లకి రూ.24500 అమలుచేయాలని కోరారు. దీనిపై సానుకూలంగా సపందించిన కమిషనర్ ఆప్కాస్‌కు పంపి పరిష్కారం చేస్తానహామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.వి.రమణ, నాయకులు చెన్నయ్య, రాంబాబు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం :'చింతల'

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను అమలు పరచడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మూరేవాండ్లపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు అందించాల్సిన సూపర్‌సిక్స్ హామీలను పక్కన పెట్టి రెడ్‌బుక్ పరిపాలనను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు భయభ్రాంతులకు గురయ్యేలా ఎక్కడికక్కడ దోపిడిలు, మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. పనిగట్టుకొని వైసిపిపై నిందలు వేయడం తప్ప రైతులు, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగులకు చేసిందేమి లేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని, మహిళలకు రక్షణ కొరవడిందన్నారు. గత ఐదున్నర నెలల్లో 110 మంది మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు జరిగాయని, 11 మంది చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగ భృతి కూడా అమలు చేయలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని పేర్కొన్నారు. వాలంటీర్లను గాలికొదిలేశారని, ఆర్భాటంగా ప్రచారం చేసిన మెగా డిఎస్‌సిని వాయిదా వేయడం సమంజసం కాదన్నారు. సంపద సృష్టిస్తున్నామంటూ వేల కోట్లు అప్పులు చేయడమేనా అభివృద్ధి అంటే అని ప్రశ్నించారు. ఉచిత ఇసుక పేరుతో అక్రమ ఇసుక రవాణాకు తెరలేపారన్నారు. తక్కువ ధరకు నాణ్యమైన మద్యం అని ప్రచారం చేస్తూనే పక్క రాష్ట్రాలకన్నా అధిక ధరలకు అమ్ముతున్నారని, ఊరూరా యథేచ్ఛగా బెల్ట్‌షాప్‌లు వెలుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నీళ్లభాస్కర్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రెడ్డి అర్జున్ రెడ్డి, నాయకులు ద్వారకనాథ రెడ్డి, కేశవ రెడ్డి, వేమనారాయణ రెడ్డి, రమేష్, భాస్కర్, వాసుదేవ, తదితరులు పాల్గొన్నారు.

సంబేపల్లి మండల నూతన కమిటీ కార్యవర్గ సభ్యులు

తల్లికి వందనం ప్రతి విద్యార్థికీ ఇవ్వాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

తల్లికి వందనం ప్రతి విద్యార్థికీ ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు పవన్ నాయుడు అన్నారు. శుక్రవారం సంబేపల్లి మండల కేంద్రంలో జడ్‌పిహెచ్ఎస్ పాఠశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యతనిస్తూనే మరోపక్క 9 నుండి సాయంత్రం 5 గంటల వరకు సమయపాలన మార్చడం దుర్మార్గం అన్నారు. దీని ద్వారా విద్యార్థులు అనేక ఇబ్బందులు పడే పరిస్థితి ఉందన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు పోవడానికి రవాణా సౌకర్యం లేక చాలా మంది విద్యార్థులు మధ్యలోనే చదువు మానేసే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. దీనిపై వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని యథావిధిగా అమలు చేయాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మనబడి మన భవిష్యత్తు పేరుతో పెండింగ్‌లో ఉన్న భవనాలను పూర్తి చేసి విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని కోరారు. తల్లికి వందనం ఎలాంటి షరతులు లేకుండా ప్రతి విద్యార్థికీ అందేలా నిబంధనలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యా పరిరక్షణ కోసం మండల నూతన కమిటీ పోరాటం చేయాలని కోరారు. అనంతరం సంబేపల్లి మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా చైతన్య, ఆనంద్ ఉపాధ్యక్షులుగా సమీర్, నాగరాజ్, వినయ్, హరి నాయుడు, సహాయ కార్యదర్శిలు బాలనరసింహ, సంతోష్ కుమార్, నాగేంద్ర, చరణ్,సోహెల్ ఎన్నికయ్యారు.

నేడు మహిళలకు ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్ : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా శనివారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు శుక్రవారం డిప్యూటీ డిఇఎంఒ దేవా సరోమని అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ వారి ఆదేశాల మేరకు మహిళలకు శనివారం రాయచోటి డైట్‌కళాశాలలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఇందులో మొదటి విజేతకు రూ.1111, రెండవ విజేతకు రూ.777, మూడవ విజేతకు రూ.555 ఇవ్వడంతో పాటు పాల్గొన్న ప్రతి ఒక్కరికి బహుమతులు అందిస్తామని అన్నారు. విజేతలుగా గెలిచిన వారికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య, అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శైలజ చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రంతో పాటు మెమోరాండం అందిస్తారని తెలిపారు. పోటీలో పాల్గొనే మహిళలు 7396390632, 7569166129 కు కాల్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. రాయచోటి, చుట్టుపక్క ప్రాంత మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రాజ్యసభలో వడ్డెరలకు స్థానం కల్పించాలి

ప్రజాశక్తి - రాయచోటి

ప్రజాగళం, యువగళం పాదయాత్రలో భాగంగా నారా చంద్రబాబునాయుడు, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్ వడ్డెరలకు చట్టసభల్లో ప్రాధాన్యతనిస్తామన్న హామీని నిలబెట్టు కోవాలని ఎపి ఒడ్డ మేధావుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ కె.జీవానందం పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఒక ప్రయివేట్ సమావేశ మందిరంలో విలేకరుల సమావేశంలో మేధావుల ఫోరం యువజన విభాగం నాయకులతో కలిసి మాట్లాడుతూ తాజాగా ఎన్నికల కమిషన్ ప్రకటించిన రాష్ట్రంలోని ఖాళీ అయిన మూడు రాజ్యసభస్థానాల్లో ఒకటి వడ్డెరలకు కేటాయించాలని పేర్కొన్నారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలలో వడ్డెరలు చాలావెనుకబడి ఉన్నందున అన్నివిధాలా ఆదుకుంటామని తెలుగుదేశం పార్టీ అగ్రనా యకులు ఇచ్చిన హామీలను ఆయన ఈసందర్భంగా గుర్తుచేశారు. గత ప్రభుత్వం ఆశించినంత స్థాయిలో సీట్లు ఇవ్వక పోయినా ఎంతోకొంత ప్రాధాన్యత కల్పించిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రాజ్యసభ సీటును తమకే కేటాయిస్తారనే పూర్తి విశ్వాసముందని ఆయనన్నారు. సమావేశంలో గాలివీడు మండల నాయకుడు రవీంద్రబాబు, యువజన నాయకులు మారుతి ప్రసాద్, రాజోళ్ళ సాయిక్రిష్ణ, కె.లోకేశ్వర పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకు క్షేత్రస్థాయిలోనే పరిష్కారం : తహశీల్దార్

ప్రజాశక్తి-పీలేరు

క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించాలన్నదే సివిల్ రైట్స్ డే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని పీలేరు తహశీల్దారు ఎం.భీమేశ్వర రావు తెలిపారు. శుక్రవారం పీలేరు పట్టణంలోని లక్ష్మీపురంలో తహశీల్దారు అధ్యక్షతన సివిల్ రైట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు ప్రజలను అడిగి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ లక్ష్మీపురంలో షెడ్యూల్ కులాలకు చెందిన సుమారు 150 గృహాలు ఉన్నాయని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం వాటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా ఇవ్వాల్సి ఉందని అన్నారు. అయితే ఇక్కడ ఎవరికి ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరడంలేదని, విద్యుత్ బిల్లులు అధిక మొత్తంలో వస్తున్నాయని ఫిర్యాదు చేశారు. మురుగునీటి కాలువలు కూడా తగినన్ని లేవని, ముఖ్యంగా తమ కోసం ఒక ప్రత్యేక చౌక దుకాణం, స్మశాన వాటిక అవసరం ఉందని అధికారుల దృష్టికి తెచ్చారు. అలాగే తహశీల్దారు అక్కడి ప్రజల నుంచి వ్యక్తిగత సమస్యలను కూడా స్వీకరించారు. ప్రజలు, ప్రజా సంఘాల నాయకుల నుంచి అందిన విన్నపాలపై ఆయన స్పందిస్తూ చౌక దుకాణం ఏర్పాటుకు ఇంటర్మీడియట్ విద్యార్హత కలిగిన డ్వాక్రా మహిళలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మిగిలిన సమస్యల పరిష్కారానికి ఆయా శాఖల అధికారులకు తెలియపరుస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు సుబ్రమణ్యం, మండల విద్యాశాఖ అధికారులు లోకేశ్వర్ రెడ్డి, పద్మావతి, ఈఓపీఆర్డి లతీఫ్ ఖాన్, పంచాయతీ ఈఓ గురు మోహన్, అదనపు ఎస్ఐ లోకేష్, విఆర్ఓ ఇబ్రహీం, ఇతర రెవెన్యూ సిబ్బందితో పాటు ప్రజాసంఘాల నాయకులు గండికోట వెంకటేష్, సుధాకర్ బాబు, ధరణి కుమార్, మల్లికార్జున, సుభాష్, ప్రజలు పాల్గొన్నారు.

ఉత్సవ సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - రాయచోటి : డిసెంబర్ 1న కందుకూరులోని విక్కిర్యాల పేట రోడ్డులో ఉన్న బాలాజీ ఫంక్షన్ హాల్లో ఉదయం 10:30 గంటల నుండి జరగ బోయే విప్లవ విద్యార్థి సంస్థ పిడిఎస్‌యు అర్థ శతాబ్దపు ఉత్సవ సభను, పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని పిడిఎస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.అంకన్న కోరారు. సభలకు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరణ శుక్రవారం రాయచోటి పట్టణంలోని శ్రీ సాయి ఇంజి నీరింగ్ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ పిడిఎస్‌యు 1974 నుంచి నేటి వరకు ప్రకాశం, నెల్లూరు, జిల్లాలలో ముఖ్యంగా కందుకూరు, కావలి ప్రాంతాలలో జవహర్ భారతి కళాశాలల్లో కార్యకర్తలుగా, అభిమానులుగా పనిచేసిన పూర్వ విద్యార్థు లందరూ తరలి వస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు నాయకులు హర్షవర్ధన్,వహీద్, అమీర్, రవీంద్ర ,భాను, మంజునాథ, శివ కేశవ పాల్గొన్నారు.

ఇస్తిమా ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - రాయచోటి టౌన్ : డిసెంబర్ 7, 8వ తేదీలలో రాయచోటి పట్టణంలో నిర్వ హించబోయే ఇస్తిమా కార్యక్రమానికి సంబంధించి ముస్లిమ్ సోదరులు ఏర్పాటు చేస్తున్నారు. శుక్రవారం మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాష, కౌన్సిలర్లు, మైనారిటీ నాయకులతో కలసి వైఎస్ఆర్‌సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి పరిశీలించారు. ఇస్తిమా నిర్వహణా ఏర్పాట్లుపై మత గురువులుతో ఆయన చర్చించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రెండు రోజుల పాటు గొర్లముదివీడు క్రాస్ సమీపంలో అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించే ఇస్తిమా కార్యక్రమానికి దాదాపు ఒకటన్నర లక్షల మంది వచ్చేలా ఏర్పాట్లు చేస్తుండడం అభినందనీయమని చెప్పారు. క్రమశిక్షణ, శ్రమతో ఏర్పాట్లు చేయడంతో పాటు ఆరోగ్య శిబిరాలు, ఎక్కడా ఎటువంటి లోటు పాట్లు, కొరత లేకుండా సమన్వయంతో కార్యక్రమాలు చేస్తుండడం హర్షదాయక మన్నారు. ప్రపంచ మానవాళికి శాంతి కలగాలని పేర్కొన్నారు. ఇస్తిమా కార్యక్రమానికి తన వంతు సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, మైనారిటీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొలిమి హారూన్‌బాష, కౌన్సిలర్లు కొలిమి చాన్ బాష, గౌస్ ఖాన్, అల్తాఫ్, రౌనక్, వండాడి సర్పంచ్ ముసల్ రెడ్డి, జాకీర్, ఫయాజ్ అహమ్మద్, అన్నా సలీం, మాజీ కో-ఆప్షన్ జాఫర్ అలీ ఖాన్, జిఎండి ఇర్షాద్, నవాజ్, యూసుఫ్‌ఖాన్ పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి, ముస్లిం నాయకులు

ప్రభుత్వ ఐటిఐకి పక్కా భవనం నిర్మించాలి

ప్రజాశక్తి-పీలేరు

పీలేరులోని ప్రభుత్వ ఐటిఐ కళాశాలకు పక్కా భవనాన్ని నిర్మించాలని ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృత్ తేజ, డిబిఎస్ఎఫ్ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు భాను ప్రకాష్, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు సాయి సంపత్ కుమార్ తెలిపారు. శుక్రవారం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రధాన ద్వారం ముందు విద్యార్థులతో వారు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డి హయాంలో పీలేరు నియోజకవర్గంలో అనేక ప్రభుత్వ విద్యా సంస్థలు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. పీలేరులో ఏర్పాటైన ప్రభుత్వ ఐటిఐ కళాశాల కూడా ఒకటని ఉన్నారు. ప్రభుత్వ ఐటిఐ కళాశాల విద్యార్థులకు పక్కా భవనం లేక అనేక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు వారు చెప్పారు. స్థానిక ప్రభుత్వ ఐటిఐ కళాశాలకు భూమి కూడా సిద్ధంగా ఉందని తెలిపారు. వైసిపి అధికారంలో ఉండగా దాదాపు రూ.5 కోట్లు పక్కా భవన నిర్మాణానికి నిధులు కేటాయించిందని, తదుపరి ఏ కారణం చేతనో ఆ నిధులు రద్దయ్యాయని తెలిపారు. పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపి ప్రభుత్వ ఐటిఐ కళాశాల పక్కా భవన నిర్మాణానికి నిధులు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా నియోజకవర్గంలో అనేక విద్యాసంస్థలకు పక్కా భవనాలు లేక అద్దె భవనాల్లో నిర్వహించాల్సి వస్తోందని, వాటికి కూడా పక్కా భవనాలు నిర్మించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసుకున్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'మిట్స్'లో సైబర్ భద్రతపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-మదనపల్లి

మిట్స్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సైబర్ సెక్యూరిటీ) వారు లైవ్ హ్యాకింగ్ ఇన్ యాక్షన్ సైబర్ బెదిరింపులు, వాస్తవ-ప్రపంచ దోపిడీలపై విద్యార్థులకు అతిథి ఉపన్యాసంను ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల పూర్వ విద్యార్థి 4 కార్పస్ వ్యవస్థాపకుడు, సిఇఒ కుప్పం జోహరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న డిజిటల్ పరివర్తన ఆధిపత్యంలో సైబర్ భద్రత యొక్క ప్రాముఖ్యత ఎంతో ఉందని, ప్రతి ఒక్కరి వ్యక్తిగత డేటా ఉల్లంఘనల నుండి పెద్ద ఎత్తున కార్పొరేట్ దాడుల వరకు, సైబర్ బెదిరింపులు వ్యక్తులు, వ్యాపారాలు మరియు ప్రభుత్వాలకు ఒకేలాగా మారాయి అని పేర్కొన్నారు. ఈ బెదిరింపుల యొక్క చిక్కులను గ్రహించడానికి, లైవ్ హ్యాకింగ్ ఇన్ యాక్షన్‌కి సాక్ష్యమివ్వడం కంటే మెరుగైన మార్గం లేదని పేర్కొన్నారు. సైబర్ బెదిరింపులు సిస్టమ్‌లు, నెట్‌వర్క్‌లు, అప్లికేషన్‌లలోని బలహీనతలును ఉపయోగించుకునే అనేక రకాల హానికరమైన కార్యకలాపాలను కలిగి ఉంటాయని తెలిపారు. ఈ బెదిరింపులు తరచుగా సున్నితమైన సమాచారాన్ని దొంగిలించడం, కార్యకలాపాలకు అంతరాయం కలిగించడం మొదలైనవి లక్ష్యంగా ఉంటాయని పేర్కొన్నారు. ఫిషింగ్ దాడులు, మాల్వేర్, వైరస్‌లు, వార్మ్‌లు, మ్యాన్-ఇన్-ది-మిడిల్ అటాక్స్ వంటివి సాధారణ సైబర్ బెదిరింపులుగా పరిగణించవచ్చుని పేర్కొన్నారు. వీటి పై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్తీక్‌రామ్, అసిస్టెంట్ ప్రొఫెసర్, అలుమ్ని రిలేషన్స్ ఆఫీసర్ డాక్టర్ ఆర్. కిరణ్ కుమార్, విభాగాధిపతి డాక్టర్ గంగా దేవి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక నగదును అందిస్తున్న మేనేజర్ శ్రీనివాస్

విద్యార్థులకు నగదు ప్రోత్సాహం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల కేంద్రంలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమ తులను అందించింది. ఈ సందర్భంగా గ్రామీణ బ్యాంక్ మేనేజర్ మూరి శ్రీనివాస్ మాట్లాడుతూ మండల పరిధిలోని ఎస్‌బి విడి సభ హైస్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొత్తపేట, కెజిబివిహై స్కూల్ మొదలగు పాఠశాలలో 6,7, 8 తరగతిలో ఎస్‌సి, ఎస్‌టిలకు చెందిన ఒక్కొక్క తరగతిలో ఒక్కొక్క విద్యార్థిని గుర్తించి వారికి ఐదువేల రూపాయలు నగదు ప్రోత్సాహక బహు మతి అందించినట్లు తెలిపారు. ఎపిజిబి ప్రధాన కార్యాలయం ఆదేశాల మేరకు విద్యా జ్యోతి పథకం కింద ఈ సంవత్సరానికి ముగ్గురు విద్యార్థులను ఎంపిక చేసి వారికి వారి బ్యాంకు ఖాతాలో ఐదువేల రూపాయలు జమ చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ నగదు వారి విద్యా ఖర్చులకు వినియోగించుకోవాలని తెలిపారు. తమ శాఖ రూ.150 కోట్లు నికర వ్యయాన్ని సాధించి అగ్రగా మిగా ఉందని, ఖాతాదారులు మా సేవలు వినియోగించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది శశికళ, చంద్రశేఖర, జగ్గు బాబు, నవీన్ కెజిబివి ప్రిన్సిపల్ రూత్ మేరీ, రాజయ్య పాల్గొన్నారు. **గాలివీడు :** విద్యలో మంచి మార్కులతో రాణిస్తున్న విద్యార్థినిలకు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ వారు ప్రగతి విద్యా జ్యోతి పథకం కింద 7, 8, 9 తరగతులలో అత్యధిక ప్రతిభ చూపిన విద్యార్థులకు తరగతికి ఒకరికి చొప్పున రూ.5వేలు చెక్కును అందజేశారు. స్థానిక కెజిబివిలో ఎస్ఒ నీరజ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏపీజీబీ బ్యాంక్ మేనేజర్ కె.వెంకట్రావు మాట్లాడుతూ విద్యార్థినిలు విద్యలో ఎదగడానికి బ్యాంకు ద్వారా ప్రొత్సాహం అందిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎఇ1 పిల్లి నాగరాజు , ఎంఇఒ-2 శ్రీనివాసులు, బ్యాంక్ సిబ్బంది విజయకుమార్, వెంకటసాయి, కృష్ణ విద్యార్థినిలు పాల్గొన్నారు.

విద్యుత్ ఎఇ లేక అవస్థలు

ప్రజాశక్తి-గాలివీడు

సుమారు 50 వేల జనాభా ఉన్న గాలివీడు మండలంలో 17 గ్రామాలు ఉన్నాయి. అందులో మండల కేంద్రంలో సబ్‌స్టేషన్‌కు అసిస్టెంట్ ఇంజినీర్ లేక ప్రజలు రాయచోటికి పోయే పరిస్థితి ఏర్పడుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే మండల వ్యాప్తంగా 185 మంది రైతులకు విద్యుత్ కనెక్షన్లు కూడా అలానే పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. కార్యాలయంలో సరైన అవగాహన లేక మండల స్థాయిల అధికారి లేకపోవడం వల్ల పరిస్థితులన్నీ సమస్యగానే మిగిలిపోయాయని అన్నారు. జిల్లా అధికారులు స్పందించి మండల కేంద్రానికి అసిస్టెంట్ ఇంజినీర్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రేపు భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

హిందూ ధర్మ ప్రచార పరిషత్తు అన్నమయ్య జిల్లా శాఖ ఆధ్వర్యంలో వచ్చే ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలు జరగనున్నట్లు జిల్లా ప్రోగ్రామ్ అసిస్టెంట్ గోపిబాబు, ధర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణలు శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. 6, 7 తరగతులు ఒక విభాగంగాను, 8, 9, 10 తరగతులు ఒక విభాగంగాను, 18 సంవత్సరాల లోపు వారు, 18 సంవత్సరాల పైబడిన వారు ఇలా మొత్తం నాలుగు విభాగాలలో పోటీలు జరుగుతాయని వారు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారంతో పోటీలలో పాల్గొనాలని కోరారు. ఒక్కో విభాగం నుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన వారికి బహుమతులను ప్రదానం చేయడం జరుగుతుందని తెలిపారు. భగవద్గీతలోని 6వ అధ్యాయం ఆత్మ సంయమ యోగంలోని 47 శ్లోకాలను విద్యార్థులు చెప్పాల్సి ఉంటుందన్నారు. 18 సంవత్సరాల లోపు వారు, 18 సంవత్సరాలకు పైబడిన వారు సంపూర్ణ భగవద్గీతపై పోటీలలో పాల్గొనాల్సి ఉంటుందని అన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ పోటీలలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాలల ఐక్యవేదిక నాయకులు

మాలల సింహగర్జనను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-పీలేరు

మాలల సింహ గర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అఖిల భారత మాలల సంఘాల జెఎసి పిలుపునిచ్చింది. పీలేరు అంబేద్కర్ సర్కిల్లోని అంబేద్కర్ విగ్రహం వద్ద మాల మహానాడు ఐక్యవేదిక పీలేరు మండల అధ్యక్షుడు చీకటిపల్లి మల్లికార్జున ఆధ్వర్యంలో హలో మాల చలో గుంటూరు కార్యక్రమం గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన రాజ్యాంగ వ్యతిరేక ఎస్‌సి, ఎస్‌టి రిజర్వేషన్ల వర్గీకరణ క్రిమిలేయర్ తీర్పును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 15న గుంటూరు నల్లపాడు రోడ్డు, హౌసింగ్ బోర్డు కాలనీ, సీతారామ టౌన్ షిప్ ఎదురుగా సాయంత్రం 4 గంటల ప్రాంతంలో జరిగే మాలల మహా గర్జన బహిరంగ సభకు మాలలు అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సభకు మాల మేధావులు, రాజకీయ నాయకులు, మాల ఉద్యోగులు, అంబేద్కర్ వాదులు, మాల విద్యార్థులు, ఉద్యమకారులు తరలి రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు ఐక్యవేదిక రాష్ట్ర ప్రధానకార్యదర్శి గుర్రం నారాయణ, రాయలసీమ జిల్లాల అధ్యక్షులు చీకటిపల్లి రామాంజులు, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు నక్క వెంకటరమణ, జిల్లా గౌరవ సలహా దారులు గుండ్లూరి జయరామచంద్రయ్య, జిల్లా కమిటీ సభ్యులు మోహన్ బాబు, కెవి పల్లి, ఊటుపల్లి రమణ, గుర్రం లోకనాధ, వెంకటరమణ, సభ్యులు పాల్గొన్నారు.

జనసేవాదళ్ రాష్ట్ర శిక్షకులుగా ఎంపికైన వెంకటేష్

ప్రజాశక్తి-పీలేరు

రాష్ట్రంలో జరగనున్న జనసేవాదళ్ శిక్షణ క్యాంపు కార్యక్రమానికి శిక్షకులుగా ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు టిఎల్ వెంకటేష్ ఎంపికయ్యారు. శుక్రవారం ఆయన పీలేరులో మీడియాతో మాట్లాడుతూ డిసెంబర్ 3 నుంచి 7 వరకు గుంటూరు జిల్లా, నందిగామలో 500 మంది కార్యకర్తలకు శిక్షణ బాధ్యతలు అప్పగిస్తూ సిపిఐ రాష్ట్ర పార్టీ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. రాష్ట్రంలో జన సేవాదళ్ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్ర పార్టీ ఇచ్చిన బాధ్యతలను తాను స్వీకరిస్తూ పార్టీ నిర్మాణం లోనూ, దేశంలో ఎలాంటి విపత్కర పరి స్థితులు ఎదురైనా జనసేవదళ్ కార్యకర్తలు ముందుండి సేవ చేయడానికి వారిని శారీరకంగానూ, మానసికంగాను దృఢంగా ఉండేందుకు ఈ శిక్షణ ఇస్తామని అన్నారు. విద్యలు కార్యకర్తలకు నేర్పిస్తానని ఆయన తెలిపారు.

CHANGE OF NAME

I, Shaik Peddapalyam Bavaajan S/o Khasim saheb shaik (old name in passport) Passport No: R8541320, residing at D. No. 7-44, pogachuri street, Peddathippasamudram Village & Mandalam, Annamayya district. Hereby declare that I have changed myname as P.S. bavajaan (New name in aadhar card) S/o Khasim Saheb

ప్రభుత్వ భూముల జోలికొస్తే కఠిన చర్యలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రభుత్వ భూముల జోలికొస్తే కఠిన చర్యలు తీసుకుంటామని భూకబ్జాదారులను ఎమ్మెల్యే షాజహాన్ బాషా హెచ్చరించారు. గతంలో పేదలకు హౌసింగ్ కాలనీ కేటాయించిన బయ్యారెడ్డి కాలనీ, జామతోట ప్రాంతాల్లో అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జామతోట సమీపంలోని సర్వే నెంబర్ 602, 603, 604లో 5 ఎకరాల భూమిని గతంలో ఇంటి పట్టాల కోసం కేటాయించడం జరిగిందన్నారు. కొందరు భూ ఆక్రమణ దారులు ఇష్టానుసారం వ్యవహరిస్తూ ప్రభుత్వ భూములు విక్రయిస్తున్నారని, ఇకపై వారి ఆటలు సాగవని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు భూ ఆక్రమణదారుల భరతం పట్టేందుకు కొత్తచట్టం తీసుకొచ్చారని అన్నారు. ఈ సర్వే నెంబర్లలో అధికారులు అర్హులైన పేదలకు రెండు సెంట్ల చొప్పున స్థలం కేటాయించాలని సూచించారు. ప్రభుత్వ భూమి పేదలకు గృహ నిర్మాణాలకు గానీ, ప్రభుత్వ అవసరాలకుగాని వినియోగించాలే తప్ప కబ్జాదారుల పరం కాకూడదని అన్నారు. ప్రభుత్వ భూములను రెవిన్యూ, హౌసింగ్ అధికారుల కృషిని ఆయన కొనియాడారు. ప్రజా శ్రేయస్సు కోసం నిరంతరం పనిచేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ డిఇ రమేష్ రెడ్డి, ఎఇ దీన్ దయాల్‌రాజు, ఎంపిడిఒ తాజ్ మస్రూర్ రెవిన్యూ ఆర్ఐ, పంచాయతీ కార్యదర్శి గిరి, టిడిపి నాయకులు బొమ్మిశెట్టి పురుషోత్తం, రాటకొండ శ్రీనివాసులు నాయుడు, యర్రబల్లి వెంకటరమణారెడ్డి, రామిశెట్టి కృష్ణ, కంచర్ల మల్లికార్జున నాయుడు, కొరముట్ల నాగరాజు, బీదం గురునాథ్ యాదవ్, మడితం రమణ, మోహన్‌రెడ్డి, జీవి నాయుడు, ముంబై దుర్గ, రెడ్డి రాయల్స్, రాధమ్మ, మహాలక్ష్మి, నాగమణి, నందిని పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రతి రైతు ఇ-పంట నమోదు చేసుకోవాలి : డిఎఒ

లక్కిరెడ్డిపల్లి : సమావేశంలో మాట్లాడుతున్న ఎడిఎ చంద్రానాయక్

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

రబీలో సాగు చేసే ప్రతి రైతుకు ఇ-పంట కచ్చితంగా నమోదు తప్పక చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్ర నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ సభా భవనంలో జిల్లా వనరుల కేంద్ర వారు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి, వీరబల్లి, రామాపురం, గాలివీడు మండలానికి సంబంధించిన వ్యవసాయ సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన ప్రతి రైతు వివరాలు ఇ-పంట యాప్‌లో నమోదు చేయాలన్నారు. వరి, వేరుశనగ, టమోటా పంటలు సంబంధించి పంట బీమా పథకం పై వ్యవసాయ సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రబిలో పంటలు సాగు చేసే రైతులకు మేలైన యాజమాన్య పద్ధతులు గురించి తెలపాలన్నారు. కార్యక్రమంలో ఎడిఎ జయరాణి, ఎఒలు నాగమణి స్వాతి సుచిత్ర, నాగరాజ్, రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర పంటల యాజమాన్య పద్ధతులు పాటించాలి

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

రైతులు ఉద్యాన పంటల సాగులో సమగ్ర యాజమాన్యం పద్ధతులు పాటించాలని అనంతరాజుపేట ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం ఎంపిడిఒ సభాభవనంలో జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో కోడూరు వ్యవసాయ డివిజన్‌లోని 4 మండలాల రైతు సేవా కేంద్రం సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడి, అరటి, బొప్పాయి పంటలలో సమగ్ర పంటల యాజమాన్యం గురించి రైతులకు వివరించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు, కె.కవిత మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో సిబ్బంది ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమలను రైతులకు చేరవేసి రైతుల శ్రేయస్సుకు పాటుపడాలని ఆదేశించారు. ప్రతి పంట వేసిన రైతుకు పంట నమోదు పొరపాట్లు లేకుండా చేయాలని ఆదేశించారు. కార్యక్ర మంలో జిల్లా వనరుల కేంద్రం, రాయచోటి ,అన్నమయ్య జిల్లా వ్యవసాయ అధికారి రామకృష్ణమ రాజు, అగ్రి టెస్టింగ్ ల్యాబ్, కోడూరు వ్యవసాయ అధికారి శ్రీరాములు, మండల వ్యవసాయ అధికారులు జి.సుధాకర్, సందీప్, శ్రీకర్,4 మండలాల రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.


సిఐకి ఫిర్యాదు చేస్తున్న మనోహర్ నాయుడు

అక్రమ కేసుల నుంచి విముక్తి కల్పించండి

- పోలీసులకు మనోహర్ నాయుడు వేడుకోలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ప్రభుత్వంలో తనపై పెట్టిన అక్రమ కేసుల నుండి విముక్తి కల్పించాలని మండలంలోని గుమ్మసముద్రం పంచాయతీ, బావగారి పల్లెలో నివాసముండే బూర్లపల్లి రాజన్న నాయుడు కుమారుడు బి.మనోహర్ నాయుడు పోలీసులను విజ్ఞప్తి చేశారు. శుక్రవారం బి.కొత్తకోట పోలీసులకు విన్నపాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మనోహర్ నాయుడు మాట్లాడుతూ తాను టిడిపి సానుభూతిపరుడననే నెపంతో అప్పటి ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి,పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తిరుమల అమరనాథ్, లోకనాథ్ అనే వారు తనను మానసికంగా వేధింపులకు గురిచేశారని అన్నారు. తన పెద్ద కుమారుడు హరికృష్ణ నాయుడు ఆర్మీలో ఉద్యోగం నిర్వహిస్తున్నాడని, ఆగస్టు 6, 2023లో నాసిక్‌లో పెరేడ్ నిర్వహించగా తాము హాజరయ్యామని అన్నారు. తాము తిరిగి బావ గారు పల్లెకి వచ్చిన తర్వాత అప్పటి ఎస్ఐ రామ్మోహన్ తనను అప్పటి డిఎస్‌పి కేశప్ప నాయుడు చెంతకు తీసుకెళ్లి కులం పేరుతో అసభ్య పదజాలంతో దూషించారని పేర్కొన్నారు. వైసిపికి వ్యతిరేకంగా పనిచేస్తున్నావని హెచ్చరించారని తెలిపారు. చంద్రబాబు పర్యటన సందర్భంగా అంగళ్లు ఘటనలో 75/2023 ద్వారా అక్రమ కేసు నమోదు చేసి 50 రోజులపాటు జైల్లో ఉంచి చిత్రహింసలకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటినుంచి ప్రతివారం ముదివేడు పోలీసు స్టేషన్‌కు వచ్చి పోవాలని షరతు విధించారని అన్నారు. తనపై నమోదు చేసిన అక్రమ కేసులను కొట్టివేయాలని సిఐ రాజారెడ్డికి విజ్ఞప్తి చేశారు. తనపై అక్రమ కేసులు బనాయించి మానసికంగా వేధించిన అప్పటి పోలీసులు, వైసిపి ప్రజా ప్రతినిధులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

-కలెక్టర్ శ్రీధర్ చామకూరి

ప్రజాశక్తి-రాయచోటి

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తహశీల్దార్‌లు ప్రత్యేక చొరవ చూపాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందే సమస్యల పరిష్కారానికి తహసిల్దార్లు ప్రత్యేక చొరవ చూపి క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్లను, రెవిన్యూ అధికారులను, తహశీల్దార్లను, డిటిలను ఆదేశించారు. శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) హాల్‌లో రెవెన్యూ సంబంధిత అంశాలపై జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్, రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియాదేవి, రెవెన్యూ అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రధానంగా రీ సర్వే, వెబ్ ల్యాండ్ కరెక్షన్స్, ఆధార్ కరెక్షన్స్, మ్యుటేషన్లకు సంబంధించి రావడం జరుగుతున్నదని తెలిపారు. సమస్యల పరిష్కారానికి తహశీల్దార్‌లు విఆర్వోలతో కలసి క్షేత్రస్థాయి పర్యటన చేయాలన్నారు. ఎవరైనా పిర్యాదు చేస్తే ఫిర్యాదుదారునికి సరైన సమాచారం అందివ్వాలన్నారు.సమస్యల పరిష్కారంలో విఆర్వోలకు తగు సూచనలు ఇచ్చి త్వరితగతిన పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో డిఆర్ఒ కె.మధుసుధన్ రావ్, రాయచోటి ఆర్‌డిఒ ఎ.శ్రీనివాసులు, ఎడి సర్వే భరత్ కుమార్, రెవెన్యూ అధికారులు, తహశీల్దార్‌లు, డిప్యూటీ తహశీల్దార్‌లుపాల్గొన్నారు.

వేణుగోపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

విఆర్‌ఒల సంఘం అధ్యక్షులుగా వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండల విఆర్‌ఒల సంఘం అధ్యక్షులుగా కన్నెమడుగు విఆర్ఒ వేణుగోపాల్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం విఆర్‌ఒలు తహశీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి విఆర్‌ఒల సంఘాన్ని ఎన్నుకున్నారు.ఉపాధ్యక్షులుగా సలీం బాషా, కార్యదర్శిగా సంజీవ్, కోశాధికారిగా నాగరాజు, సలహాదారుడిగా శంషాద్‌వల్లి, కార్యవర్గ సభ్యులుగా రాజగోపాల్, శ్రీరా ములు, వెంకటేష్ లు ఎంపికయ్యారు. విఆర్‌ఒల సమస్యలపై స్పందించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు నూతన సంఘం కృషి చేస్తుందన్నారు.

ప్రజలు సుఖశాంతులతో జీవించాలి : 'సుగవాసి'

ప్రజాశక్తి-నందలూరు

ప్రజలు సుఖశాంతులతో జీవించాలని రాజంపేట నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం పేర్కొన్నారు. మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని నీలిపల్లెలో శ్రీ మహా గణపతి దేవస్థానం 10వ వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ నేపథ్యంలో ఆయన స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఆర్‌టిసి రీజినల్ చైర్మన్ ఎద్దుల సుబ్బరాయుడు, గీతాంజలి విద్యాసంస్థల అధినేత వెంకటరమణ, జిల్లా లీగల్ సెల్ నాయకులు లక్ష్మీనారాయణ, మాజీ ఎంపిపి పల్లె సుబ్రహ్మణ్యం, కొండ్రాది గణపతి, ఉప్పు శెట్టి సుధీర్, నారపు శెట్టి శివ, ఉప్పు శెట్టి రెడ్డయ్య, మోడపోతుల రాము, పెద్ద ఎత్తున ప్రజలు, కూటమి పాల్గొన్నారు.

గుండెపోటుతో మెడికల్ కళాశాల ఎఒ మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పల్లంరాజు (ఫైల్ ఫొటో)

మదనపల్లె మెడికల్ కళాశాల పరిపాలన అధికారి పి.పల్లం రాజు(56) గురువారం రాత్రి గుండె పోటుతో మృతి చెందారు. రాయచోటి మండలం సంబేపల్లికి చెందిన పల్లం రాజు ఈ ఏడాది రాయచోటి నుంచి బదిలీపై మెడికల్ కళాశాలఎఒ గా మదనపల్లెకు వచ్చారు. గురువారం విధులు పూర్తి చేసుకుని ఇంటికి వెళ్లిన అతను అర్ధరాత్రి గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇతనికి భార్య రాజ్యలక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఎఒ మృతి పట్ల మదనపల్లి మెడికల్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ శివరామకృష్ణ, ఇన్‌ఛార్జి మెడికల్ సూపరింటెండెంట్ గాయత్రి, ఆర్ఎంఒ ప్రసాద్ రాజు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఎపిజిబి ప్రధాన కార్యాలయం తరలించొద్దు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రాష్ట్రంలోని నాలుగు గ్రామీణ బ్యాంకులు కలిసి ఒకే గ్రామీణ బ్యాంకుగా ఏర్పడుతున్నందున, కడపలో ఉన్న ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయన్ని కొనసాగించాలని ఆ బ్యాంకు ఉద్యోగ, అధికార సంఘాల ప్రతినిధులు కోరారు. ఆ మేరకు శుక్రవారం వారు వైసిపి ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డికి వినతిపత్రమిచ్చారు. అనంతరం వారు బ్యాంక్ తరలించడం వల్ల జరిగే నష్టాలను ఎమ్మెల్సీకి వివరించారు. స్పందించిన ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ కడప ప్రధాన కార్యాలయంగా పనిచేస్తున్న ఎపిజిబి మిగతా గ్రామీణ బ్యాంకులతో పోలిస్తే అతి పెద్దదని తెలిపారు. గతంలో ప్రభుత్వం కేటాయించిన స్థలంలోనే సొంత భవనం కలిగి ఉండడం, దక్షిణ భారత దేశంలో ఏ గ్రామీణ బ్యాంకుకు లేని కరెన్సీ చెస్ట్ సౌకర్యం ఉందన్నారు. అత్యంత వెనుకబడిన ప్రాంతంలో ఉండడం వల్ల ప్రతిపాదిత గ్రామీణ బ్యాంకు హెడ్ ఆఫీస్ కడపలోనే కొనసాగించడం అత్యంత ఆవశ్యకమని తెలిపారు. నూతనంగా ఏర్పడబోయే గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయం కడపలోనే కొనసాగించాలని ఎపిజిబి ఉద్యోగుల, ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షగా ఆయన పేర్కొన్నారు. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించాలన్నారు. శాసనమండలిలో కూడా ప్రస్తావించి ఎపిజిపి హెడ్ ఆఫీస్ కడపలో కొనసాగేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డి.మహమ్మద్ పాల్గొన్నారు.

సిమెంటు రోడ్డుకు భూమి పూజ నిర్వహిస్తున్న రూపానందరెడ్డి

రూ.20 లక్షలతో సిసి రోడ్లకు భూమిపూజ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని వత్తలూరు పంచాయతీ దేవసముద్రం, దేవసముద్రం వడ్డిపల్లి గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో సిమెంటు రోడ్డు నిర్మాణానికి శుక్రవారం అడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా రూపానంద రెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రతి వీధికి సిమెంటు రోడ్డు రూపకల్పనే లక్ష్యంగా గ్రామ సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నామని తెలిపారు. ప్రతి మారుమూల గ్రామానికి నూతన వైభవం తీసుకొస్తున్నామని అన్నారు. గ్రామాల్లో రోడ్లు, విద్యుత్, తాగునీరు వంటి సమస్యలు తలెత్తితే తమ దృష్టికి తీసుకుని వస్తే తక్షణమే పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. కార్యక్రమంలో రూపానందరెడ్డి తనయుడు ముక్కా సాయివిశాల్‌రెడ్డి, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న శ్రీనివాసులు

ఎమ్మెల్యే 'నల్లారి'ని కలిసిన బాస్ ప్రతినిధులు

ప్రజాశక్తి-కలికిరి

అన్నమయ్య జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు బాస్ ప్రతినిధులు, టిడిపి కలకడ మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి బరకం శ్రీనివాసరెడ్డితో కలిసి నగిరిపల్లిలో పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. పూలబొకే ఇచ్చి తన నియామకానికి సహకారం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాలకుంట శ్రీనివాసులకు శుభాకాంక్షలు తెలిపారు. వాస్తవంగా అన్యాయానికి గురైన ఎస్‌సి, ఎస్‌టి ప్రజల సమస్యలను జిల్లా కమిటీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గం చూపాలని సూచించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో టిడిపి నాయకులు సురేష్ కుమార్‌రెడ్డి, చెంగల శివశంకర్, బాస్ నాయకులు ముల్లంగి కృష్ణయ్య, వంగిమల్ల గురునాథ, పల్లెపోగు హరినాథ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉద్వేగాల నియంత్రణతో ఆరోగ్యకర జీవితం

- డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రణాళిక బద్ధమైన జీవితం ఉద్వేగాల నియంత్రణ ద్వారా ఆరోగ్యకరంగా జీవించవచ్చని విజయవాడ ఇండ్లాస్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ ఇండ్ల రామసుబ్బా రెడ్డి పేర్కొన్నారు. వైవీయూ ప్రధాన్ మంత్రి ఉచ్చతర్ శిక్షా అభియాన్ (పి.ఎం - యుఎస్‌హెచ్ఎ ఆధ్వర్యంలో 'ఉన్నత విద్యా సంస్థలలో ఉపాధ్యాయుల పని జీవిత నిలకడ మానసిక సమస్యలు' అనే అంశంపై ఆన్‌లైన్‌లో శిక్షణా కార్యక్రమం శుక్రవారం విశ్వవిద్యాలయంలో నిర్వహించారు. (పి.ఎం - యు.ఎస్.హెచ్.ఎ) సమన్వయకర్త డాక్టర్ టి.చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ సానుకూల ఆలోచనలతో ఒత్తిడిని దూరం చేయవచ్చన్నారు. సంతోషాన్ని ఇచ్చే విషయాలను గుర్తుంచుకొని దుఃఖాన్ని పెంచే విషయాలను దూరంగా ఉంచాలన్నారు. విజయాలు అపజయాలు సమానంగా స్వీకరించాలని సూచించారు. అన్ని పనులు మనమే చేయాలని, అన్నింటిలో మనమే విజయం సాధించాలనుకోవడం కరెక్ట్ కాదన్నారు. కొన్ని సమస్యలకు కాలమే పరిష్కారం చూపుతోందని తెలిపారు. చేయాల్సిన పనులను ప్రాధాన్యత క్రమంలో నమోదు చేసుకొని చేయాలన్నారు. సంతోషకర విషయాలతోపాటు బాధాకర విషయాలు కూడా మిత్రులు కుటుంబ సభ్యులతో పంచుకోవాలన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన విసి ఆచార్య కె. కృష్ణారెడ్డి మాట్లాడుతూ వైవీయూ అధ్యాపకులకు ఉపయోగపడే మంచి కార్యక్రమాన్ని సమన్వయం చేసిన చంద్రశేఖర్‌ను అభినందించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి. పద్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. ప్రిన్సిపల్ ఎస్.రఘునాథ రెడ్డి మాట్లాడుతూ ప్రణాళిక బద్ధమైన జీవితం ద్వారానే ఆరోగ్యంగా ఉండగలుగుతామన్నారు. సభ్యులు, వైవీయూ రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల అధ్యాపకులు పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మహిళా సంఘాల సభ్యులు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకునే విధంగా సిసిలు, సంఘమిత్రలు చైతన్యపరచాలని ఇండియన్ బ్యాంక్ డిజిఎం బాలచంద్ర మోహన్ కోరారు. శుక్రవారం స్త్రీశక్తి భవన్‌లో సిసిలు, సంఘమిత్రలతో సమావేశం జరిగింది. బ్యాంకు లింకేజీ రుణాలు మహిళా సంఘ సభ్యులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. తిరిగి బ్యాంకు ఒక సక్రమంగా చెల్లించినప్పుడే సభ్యులు కోరిన విధంగా రుణాలు పొందే అవకాశం ఉంటుంద న్నారు. సిసిలు, సంఘమిత్రలు సక్రమంగా గ్రూపులు నిర్వహిస్తున్న సంఘాలకు బ్యాంకు లింకేజీ వెంటనే మంజూరు చేసేందుకు బ్యాంకర్లకు సహకరించాలన్నారు.ఈ సమావేశంలో మండల సమైక్య అధ్యక్షురాలు రామలక్ష్మి, ఇండియన్ బ్యాంక్ మేనేజర్ హరినాథ్ గుప్తా, సిసిలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బ్యాంకు డిజిఎం బాలచంద్రమోహన్

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పీలేరు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన కెవిపల్లి మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కాకినాడకు చెందిన రంగనాథ్(54) గత పదేళ్లుగా పీలేరులో ఒంటరిగా నివాసముంటూ వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడని తెలిపారు. తన వ్యాపార లావాదేవీల్లో భాగంగా శుక్రవారం నగదు వసూళ్ల కోసం పీలేరు నుంచి గర్నిమిట్టకు ద్విచక్ర వాహనంలో బయలుదేరాడని చెప్పారు. మార్గం మధ్యలోని నారమాకులపల్లె వద్ద అడవి పందులు అడ్డు రావడంతో అతని ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడ్డాడని చెప్పారు. తలకు బలమైన గాయమై కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న బాధితుడిని స్థానికులు చికిత్స కోసం 108 వాహనంలో పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారన్నారు. చికిత్సపొందుతూ అతను మృతి చెందాడని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.